

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 263 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 19, ఆగస్టు 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# ఆర్ఎస్ఎస్ ఉగ్రరూపం అంతరించబడాలి

## దేశాన్ని “ఆగం” చేస్తున్న ఆర్ఎస్ఎస్

మత ఉన్మాదులను తయారుచేస్తుంది

దేశవ్యాప్తంగా దాడులను ప్రేరేపిస్తుంది

100 ఏండ్ల చరిత్ర కలిగిన సంస్థ దేశానికి చేసిన మేలు ఏంది

అనధికార వ్యవస్థ అధికారికంగా ప్రభుత్వాలను శాసిస్తుంది

1951లో ఆర్ఎస్ఎస్ ను పూర్తిగా రద్దుపరిచారు

ప్రైవేట్ వ్యవస్థ చలామణికి దండీగా సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఆర్ఎస్ఎస్ సంస్కృతి దేశాన్ని అధోగతి పాలుచేస్తుంది

కర్ర శిక్షణ కాస్త కత్తుల శిక్షణగా కత్తుల శిక్షణ కాస్త మారణాయుధాల శిక్షణలుగా పర్వీదులు సాగుతున్నాయి

దళితులు దేశంలో బతుకొద్దనే ఏకైక నినాదాన్ని బలపరుస్తున్నది ఆర్ఎస్ఎస్ : డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశ రాజకీయాలను దేశ న్యాయస్థానాలను దేశ చట్టాలను శాసించే విధంగా ఆర్ఎస్ఎస్ వ్యవహార శైలి నిర్మాణం దాల్చిందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా మండిపడ్డారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆర్ఎస్ఎస్ మత కల్లోల దాడులను ఎవరు వేలెత్తి చూపెట్టకపోగా ప్రభుత్వాలు పూర్తిగా సహకరిస్తూ న్యాయస్థానాలను చట్టాలను కట్టడి చేస్తున్నాయన్నారు.దేశాన్ని రక్షించడం కోసం కట్టుబడాల్సిన ప్రభుత్వం విచ్చలవిడి దాడుల్లో మారణాయుధాలు ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలను తోడేస్తున్నప్పటికిని కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుందన్నారు.వందేళ్ళ చరిత్ర కలిగిన ఆర్ఎస్ఎస్ ప్రైవేట్ సంస్థ దేశానికి చేసిన మేలేందో మేధావులకే తెలియాలన్నారు.దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాద దాడులు మతకల్లోలాలు పూర్తిగా కట్టడి చేయబడాలంటే ఆర్ఎస్ఎస్ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. భారతదేశానికి వెన్నుముకల నిలుస్తున్న భారత రాజ్యాంగానికి అన్ని వైపులా తూట్లు పొడుస్తుండడం ఆర్ఎస్ఎస్ కొనసాగిస్తున్న ప్రధాన కార్యక్రమమన్నారు.అవకాశం దొరికినప్పుడల్లా ఆర్ఎస్ఎస్ ప్రధాన ప్రతినిధులు ఆర్ఎస్ఎస్ చీఫ్ భారత రాజ్యాంగాన్ని మార్చాల్సిందే అంటూ బహిరంగ ప్రకటనలు

- మిగతా 2లో..




## మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు

రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి

బిసి రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనలో సిఎం

3



## ప్రధాని మోడీతో రాధాకృష్ణన్ భేటీ

న్యూఢిల్లీ,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్): మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సోమవారంనాడు కలుసుకున్నారు. ఎన్డీయే సమావేశాల్లో పాల్గొనేందుకు, పలువురు నేతలను కలుసుకునేందుకు రాధాకృష్ణన్ ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనకు నా అభినందనలు తెలియజేశాను. సుదీర్ఘ ప్రజా సేవ, అనుభవంతో ఆయన దేశ కీర్తిని పెంచారు. అదే అంకితభావంతో దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నాను అని మోడీ ట్వీట్ చేశారు.



## దళిత క్రైస్తవులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి : ఆర్.మోజెస్ డిమాండ్

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

బంజారా హిల్స్ దళిత క్రైస్తవులకు వారి కులాలను బట్టి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్. మోజెస్ బంజారా హిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఎస్సీ,ఎస్టీ మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్‌ను ఆర్. మోజెస్ మరియు దళిత క్రైస్తవ ఐక్యవేదిక బృందం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్. మోజెస్ మాట్లాడుతూ “దళిత క్రైస్తవులు తమ మూల కులాల ఆధారంగా గుర్తింపు పొందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. కుల ధృవీకరణ పత్రాల లేమి కారణంగా దళిత క్రైస్తవులు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలలో అనేక నష్టాలను ఎదుర్కొంటున్నారు” అని పేర్కొన్నారు. మంత్రి అల్లూరి లక్ష్మణ్ ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, తగిన విధంగా ప్రభుత్వ స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ బరిగెల శివ



వరంగల్ (జై భీమ్ న్యూస్)

అయినవోలు మండలం ఉప్పరపల్లి క్రాస్ రోడ్‌లోని కళ్యాణ లక్ష్మి గార్డెన్ లో బరిగెల సునీల్ (తమ్ముడు) ఎస్తర్ వివాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ శుభసందర్భంగా కుటుంబ సభ్యులు,బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో జైభీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నయ్యగా పాల్గొని, కుటుంబ పెద్దలు, మరుపట్ల దేవదాస్,బరిగెల ఏలియా బంధువులు,స్నేహితులతో కలిసి నూతన దంపతులను ఆశీర్వదించడం విశేషం. అందంగా అలంకరించిన వేదిక, పూలతో నిండిన శోభాయమాన వాతావరణం వివాహ వేడుకకు మరింత ఆకర్షణగా నిలిచింది. నూతన వధూవరులు సుఖసంతోషాలతో జీవించాలని హాజరైన ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు.

## మహారాష్ట్ర వరదల్లో కారుతో సహా కొట్టుకుపోయిన తెలంగాణ ఫ్యామిలీ

వివరాలు 2లో

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ఆర్ఎస్ఎస్ 'ఉగ్రరూపం' అంతరించబడాలి

మొదటి పేజీ తరువాయి

చేస్తుండడం దేశ భవిష్యత్తును అంధకారంలోనికి నెట్టివేయడమేనన్నారు.ఒక ప్రైవేట్ సంస్థ భారత రాజ్యాంగాన్ని మార్చాలని బహిరంగంగా ప్రకటన చేయడం ఏంటో దేశంలో ఏం జరుగుతుందో దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.సోషల్ మీడియాలో గూగుల్లో ఎక్కడ ఓపెన్ చేసి చూసిన ఆర్ఎస్ఎస్ దాడులే ఎక్కువ శాతం కనిపిస్తున్నాయన్నారు.దేశ ప్రజలు వాళ్ల వాళ్ల ఆత్మగౌరవాలకు ప్రతీకగా జీవిస్తుండగా వాళ్లందరినీ బలవంతంగా దాడులు కొనసాగిస్తూ మతం మారాలని విపరీతమైన కక్షలను ప్రేరేపిస్తుండటం దేశం మనగడకు భారత రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమన్నారు. దేశస్థాయి నాయకులు భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామంటూ చాటు మాటలు ఘాటుగా మాట్లాడుతూ లోలోపల రాజ్యాంగాన్ని అంతరించే కుట్రలు పన్నుతున్నారన్నారు.1973 తర్వాత భారతదేశం లౌకిక దేశంగా తీర్మానించబడి సెక్యులర్ దేశంలో దేశం ప్రజలందరూ వాళ్ళ వాళ్ల మతాలకు వాళ్ల వాళ్ల జాతులకు వాళ్ల వాళ్ల కులాలకు అనుగుణంగా ఆయా దేవుళ్లను ఆరాధించుకుంటుండగా వాళ్ళ ఆత్మస్థైర్యాన్ని వాళ్ళ ఆత్మ అభిమానాన్ని వాళ్ళ ఆత్మ గౌరవాన్ని దెబ్బ కొట్టే విధంగా మేం పాటిస్తున్న ధర్మాన్ని మాత్రమే పాటించాలనే విధంగా దాడులు చేస్తూ ప్రజలను చిత్రవధకు గురిచేస్తున్నారన్నారు.పూర్వము ఆర్ఎస్ఎస్ వాదులు శిక్షణ తరగతులలో కర్ర సాములను కుస్తీ పోటీలను నేర్పించేవారున్నారు అవి కాస్త ప్రస్తుతం కర్ర సాము బోయి కత్తి సాముగా కత్తి సాము కాస్త మారణాయుధాల సాముగా తర్ఫీధులు చేయించబడుతూ న్యాయస్థానాల నియమాలను చట్ట స్థానాల నియమాలను ఏమాత్రం పాటించకుండా దేశానికి అసాంఘిక శక్తుల సమూహాలను అందిస్తున్నారన్నారు.1951లో మహిళలకు సమాన హక్కులను ప్రసాదించే హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తూ వ్యతిరేకంగా ప్రచారాలు కొనసాగించిన ఏకైక సంస్థగా ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ మహిళా రక్షణకు వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినందున నాడే ఇట్టి సంస్థను నాటి ప్రభుత్వం రద్దీపరిచారన్నారు. మరల ఎలా నిర్మించబడిందో తెలియదు గానీ గడిచిన 11 సంవత్సరాలుగా భారతదేశాన్ని బిజెపి ప్రభుత్వం పాలిస్తున్నందున దేశంలో అన్ని కులాలను అన్ని మతాలను అన్ని జాతులను శాసిస్తూ ముఖ్యంగా క్రైస్తవులపై ముస్లింలపై విపరీతమైన దాడులు చేయిస్తూ ప్రాణాలను తీస్తున్నారన్నారు.ఆర్ఎస్ఎస్ అనే ప్రైవేట్ సంస్థ చలామణికి ప్రభుత్వం కూడా సహకరిస్తుండడంతో వాళ్ల అరాచకాలకు హద్దులు లేకుండా పోతున్నాయన్నారు.దేశంలో కొన్ని రాష్ట్రాల్లోనైతే ఎన్ని దాడులు చేసిన కేసులు కట్టడం లేదన్నారు.న్యాయస్థానాలను చట్టాలను చేతిలోకి తీసుకొని దాడులు చేస్తున్న ఏకైక సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఏదైనా ఉందంటే అది ఆర్ఎస్ఎస్ అన్నారు.ఆర్ఎస్ఎస్ సంస్థకు దేశవ్యాప్తంగా ప్రత్యేక రాయితీలు ఏమైనా కల్పించబడ్డాయో తెలియదు గానీ ఎన్ని దాడులు చేసిన ఎవరిని హతమార్చిన కేసులు మాత్రం ఉండకపోగా పైగా సన్మానాలు పొందుకుంటున్నారన్నారు. ఆచరణకు సాధ్యం కానీ వ్యతిరేక సంస్కృతిని నియమించుకొని దేశాన్ని ఆగం చేస్తూ అధోగదిపాలు చేస్తున్నారన్నారు.ఆర్ఎస్ఎస్ ఆగడాలను భారతదేశంలో నియంత్రించాల్సిందని ప్రపంచ దేశ పరిరక్షణ సంస్థను కోరారు.దేశంలో న్యాయస్థానాలు చట్టాలు చర్యలు చేపట్టగలిగితే ఇలాంటి దాడులు ఇలాంటి మరణ హోమాలు ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఇలాంటి మతకల్లోలాల దాడులు ఎందుకు సృష్టించబడేవన్నారు.భారతదేశ న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరిస్తూ దేశాన్ని రక్షించే బాధ్యతను చేపట్టాలన్నారు.న్యాయస్థానాల ముందు ఎంతటి ప్రభుత్వాలైన తోక ముడిచాక తప్పదన్నారు అలాంటిది అనధికార హోదాలో దేశ ప్రజలపై దాడులు చేస్తున్న ఆర్ఎస్ఎస్ సంస్థపై దేశంలో ఉన్న అన్ని రాజకీయ వ్యక్తులు ఐక్యంగా ఉద్యమిస్తూ వ్యతిరేకించాలన్నారు.ప్రజల జీవితాలతో చెలగాటాలాడుతున్న ఆర్ఎస్ఎస్ సంస్థను నిర్మూలించాలన్నారు.గిన్నేసి దాడులు ప్రత్యక్షంగా జరుగుతున్న కండ్లప్పగించి చూస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడంలో అధికార వర్గం పాలకవర్గం కండ్లు మూసుకున్నారన్నారు.దేశ ప్రజలపై భౌతిక దాడులు చేసే హక్కు ఇంత పెద్ద వ్యవస్థ ఐనా పోలీసు శాఖకే లేనప్పుడు ప్రైవేట్ వ్యక్తులు బహిరంగంగా ప్రజలపై దాడులు చేసుదేందని తీవ్రంగా హెచ్చరించారు.దేశంలో జరుగుతున్న దాడులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నప్పుడు విదేశీయులు దేశంపై చేస్తున్న దాడులను తీవ్రవాదుల దాడులుగా పరిగణిస్తున్నప్పుడు భారతదేశంలో భారతీయులపై జరుగుతున్న ప్రత్యక్ష పరోక్ష దాడులను తీవ్రవాదుల సంస్థలకన్నా పైపెచ్చుగా ఏమని సంబోధించాలో దేశ ప్రజలే నిర్ధారించాలన్నారు.మతం ముసుగులో ఎన్ని లాలూచీ పనులకు పాల్పడిన తప్పులేనట్లుగా భావిస్తూ ఇతర వ్యక్తుల జీవితాలను మాత్రం శాసించాలని అనుకోవడం ఏ ప్రభుత్వ వ్యవస్థలకి హక్కులు కల్పించబడలేదన్నారు.దేశంలో ప్రస్తుతం అన్నిటికన్నా ప్రమాదకరమైనది మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజలను చంపుకోమని మారణాయుధాలను సరఫరా చేయడమన్నారు.భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఆర్ఎస్ఎస్ వ్యవస్థ కొనసాగిస్తున్న అసాంఘిక కార్యకలాపాలను ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాస్వామ్య విరుద్ధ కార్యక్రమాలను రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజారక్షణకు విఘాతంను కలిగిస్తూ ఇతర మతాలపై దాడులు చేస్తున్న కక్షలను నియంత్రించడం కోసం దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన చట్టాన్ని రూపొందించాలని వేడుకున్నారు.లేనియెడల ఆర్ఎస్ఎస్ సంస్థ నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాల వల్ల దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోతుందన్నారు.దానితోపాటు ప్రజలు తీవ్రమైన భయాందోళనలో జీవిస్తూ మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు.

**ఆర్ఎస్ఎస్ వల్ల తలెత్తే ప్రమాదాలు కోకోల్లోలం.**

**ఆర్ఎస్ఎస్ వల్ల సమాజానికి కలిగే నష్టం.**

భారతదేశ భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ, జైభీమ్ టీవీ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ఆర్ఎస్ఎస్ వల్ల సమాజానికి కలిగే నష్టాలను తీవ్రంగా ఎత్తి చూపారు.

**మతపరమైన విభజన**

"ఆర్ఎస్ఎస్ అసలు పని ప్రజలను హిందూ – ముస్లిం – క్రైస్తవులుగా విడగొట్టడమే. ఇది భారతదేశం సెక్యులర్ బలాన్ని బలహీనపరుస్తుంది" అని ఆయన అన్నారు.

**కుల ఆధిపత్యం**

"మనుస్మృతి ఆలోచనలతో ఆర్ఎస్ఎస్ కులవ్యవస్థను మరింత బలపరుస్తోంది. దళితులు, బహుజనులు, మహిళలు రెండోస్థానంలోనే ఉండాలని వారు నమ్ముతున్నారు. ఇది సమానత్వానికి పెద్ద ప్రమాదం" అని స్పష్టం చేశారు. రాజ్యాంగానికి విరుద్ధం "మన రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం మీద నిలబడింది. కానీ ఆర్ఎస్ఎస్ లక్ష్యం మాత్రం హిందూ రాష్ట్రము. అంటే రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మతపరమైన జాతీయతను రుద్దే ప్రయత్నం జరుగుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజాస్వామ్యానికి ప్రమాదం..**

"బిజెపికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆర్ఎస్ఎస్, ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ సిద్ధాంతానికి వంచిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి నష్టం, ప్రజల స్వేచ్ఛకు అవమానం" అని డాక్టర్ శివ అన్నారు.

**సాంస్కృతిక దాడి..**

"మన తెలంగాణ సంస్కృతి, దళిత-బహుజన సంప్రదాయాలు, స్థానిక భిన్నత్వం అన్నీ ఆర్ఎస్ఎస్ సాంస్కృతిక విషకౌగిలిలో మునిగిపోతున్నాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలకు హెచ్చరిక "ఆర్ఎస్ఎస్ వల్ల మనకు వచ్చే పెద్ద నష్టం ఏమిటంటే – సమాజం విడిపోతుంది, కులాధిపత్యం పెరుగుతుంది, రాజ్యాంగం బలహీనమవుతుంది. ఇది కేవలం దళిత బహుజన సమస్య కాదు. ఇది భారతదేశ భవిష్యత్తు సమస్య" అని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు.

**చివరి సందేశం..**

"మన రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడం. ఆర్ఎస్ఎస్ విధానాలు సమానత్వానికి, సోదరభావానికి, ప్రజాస్వామ్యానికి శత్రువులు. అందుకే ప్రతి పౌరుడు జాగ్రత్తగా ఉండాలి. మన స్వరమే మన రక్షణ."అనే విధంగా దేశ రక్షణ కోసం సర్వమతాల సమానత్వం కోసం భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం దేశ ప్రజలు కంకణ బద్ధులై ఉండాలన్నారు.విశిష్టత కలిగి ఉన్న భారతదేశంలో విచ్ఛిన్నం చేస్తూ విభజిస్తూ పాలించాలనుకోవడం ఇకనైనా మానుకోవాలని సూచించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్. ఐపిఎస్



**ములుగు, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మరియు ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో మరియు గోదావరి పరివాహక ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపిఎస్ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్సఫర్స్ తాకవద్దని, గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని మరియు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయట రావద్దని, వరద ప్రవాహల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు. ఈ సందర్బంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు, ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, తెలియజేశారు విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం కొరకు 100 నెంబర్ ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# డబ్బులు ఇచ్చి కొన్న ప్లాట్లను మీరే కాపాడండి- గ్రీన్వెల్స్ లో ఫిర్యాదు

## పదేపదే అబద్దాలను ప్రచారం చేయవద్దు: భూములు కొన్న స్థానికులు





**జై భీమ్ న్యూస్ పర్వతగిరి / ఆగస్టు 18**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామ పరిసర తండావాసులు దౌలత్ నగర్ గ్రామంలోని గ్రామకంఠం భూమిని కొనుగోలు చేసుకుని ఇల్లు కూడా నిర్మించుకోవడం జరిగింది. ఈ గ్రామకంఠం భూమి ప్రభుత్వ భూమి కాదని కోర్టు వెలువరించిన తీర్పును అనుసరించి 1970లో ఖరీదు పూర్వకంగా కొనుగోలు చేసిన చిదురాల ఉపేందర్ కుటుంబ సభ్యులకు గ్రామకంఠం భూమిపై సర్వహక్కులు ఉన్నాయని 2018లో కోర్టు తీర్పు ఇచ్చిందని, తదనుగుణంగా కల్లెడ గ్రామానికి చెందిన సంపెల్లి వెంకటేశ్వరరావు ఆ భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు చేయగా సమీప తండాలకు చెందిన గిరిజనులము స్థానిక ఎస్సీ ఎస్టీ బీసీ వ్యక్తులము కొనుగోలు చేసి ఇల్లు కూడా నిర్మించుకున్నామని, ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం లేని అటువంటి మమ్మల్ని స్థానిక అధికార పార్టీ నాయకులు మభ్యపెట్టి గ్రామకంఠం భూమి ప్రభుత్వ భూమి అవుతుందని అబద్ధపు ప్రచారాలు చేస్తూ మాకు తీవ్ర ఆందోళనను గురి చేయడమే కాకుండా ప్రభుత్వ అధికారులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని గ్రీవెన్స్ సెల్ లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి వాటికి సంబంధించిన పత్రాలు అన్నింటిని ఇవ్వడంతో పాటు వారు చేసే కపటం నాటకాలను కూడా వివరించమని ఆధారాలను ఇచ్చామని తెలిపారు.దీనితో పాటు స్థానిక తాసిల్దార్ వెంకటస్వామి కి వినతి పత్రం అందించామని ఇప్పటికైనా స్థానిక రాజకీయ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు చొరవ తీసుకొని మమ్మల్ని బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూములు కొన్న స్థానికులు బోడ బాలమ్మ, మాలోతు పటియానాయక్, మాలోతు శ్రీను,సభావత్ సరిత, పసునూరి దినేష్, మరియు ఇండ్లు నిర్మించుకున్న యాజమాన్యులు ప్లాట్ల కొనుగోలుదారులు గ్రీన్ వెల్స్ లో ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

# ప్రధాని మోడీతో శుభాంశు శుక్లా భేటీ

## గగన్యాన్ తదితర అంశాలపై చర్చించామని మోడీ ట్వీట్



**న్యూఢిల్లీ,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యాత్రను పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా శుభాంశు తన రోదసి ప్రయాణ విశేషాలను ప్రధాని తో పంచుకున్నారు. యాత్ర విజయవంతంపై మోదీ ఆయన్ను అభినందించారు. శుభాంశు శుక్లాతో సంభాషణ గొప్పగా సాగింది. అంతరిక్షంలో ఆయన అనుభవాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగతి, భారత్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'గగన్‌యాన్' మిషన్ సహా అనేక అంశాలపై చర్చించాం. రోదసిలో శుభాంశు సాధించిన ఘనత పట్ల యావత్ దేశం గర్విస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.యాక్సియం-4 మిషన్‌లో భాగంగా జూన్ 25 నుంచి జులై 15 వరకు శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి 'ఐఎస్ఎస్' యాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. దీని కోసం శిక్షణ పొందుతూ ఏడాదిగా ఆయన అమెరికాలో ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతంపై లోక్‌సభలో ప్రత్యేకంగా చర్చించారు.

# మహారాష్ట్ర వరదల్లో కారుతో సహా కొట్టుకుపోయిన తెలంగాణ ఫ్యామిలీ

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

మహారాష్ట్రలోని ఉద్గిర్ దగ్గర వరదల్లో తెలంగాణకు చెందిన ఫ్యామిలీ గల్లంతవడం కలకలం రేపుతోంది. ఒకే ఫ్యామిలీకి చెందిన నలుగురు కారుతో సహా వరద నీటిలో కొట్టుకు పోయారు. వరదల్లో కొట్టుకుపోతున్నాం, పిల్లలు జాగ్రత్త అంటూ చివరి ఫోన్ కాల్ వచ్చిందని..తర్వాత స్విచ్ఛాఫ్ వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బాధిత కుటుంబ సభ్యులు. నలుగురు ఆచూకీ కనిపెట్టాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు గల్లంతైన వారి పిల్లలు, బంధువులు అసలేం జరిగిందంటే.? జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్ కు చెందిన ఐదుగురితో పాటు మహారాష్ట్రకు చెందిన కారు డ్రైవర్ ఆగస్టు 17న అర్ధరాత్రి మహారాష్ట్రలోని వరద నీటిలో కొట్టుకుపోయింది. మహారాష్ట్ర లోని ఓ వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఉద్గిర్ దగ్గర ఈ ఘటన జరిగింది. గల్లంతైన వారిలో అఫ్రీనాతో పాటు హసీనా, సమీనా, ఆఫ్రీన్, సోహెబ్ అనే యువకుడు, మహారాష్ట్ర కు చెందిన కారు డ్రైవర్ ఉన్నారు. వీరిలో సోహెబ్ , కార్ డ్రైవర్ వరద నీటి ప్రవాహం నుంచి ప్రాణాలతో బయటపడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్టు సమాచారం. వరదలో కొట్టుకుపోయిన వారిలో షేక్ అఫ్రీన్ తన భర్త సలీంకు ఫోన్ చేసి వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్నామని పిల్లల్ని మంచిగా చూసుకోవాలని రోధిస్తూ చెప్పిందని, తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపారు . వీళ్లంతా నిజామాబాద్ బోధన్ కు సుమారు 150 కిలో మీటర్ల దూరంలోని వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. స్వగ్రామంలో ఉన్న పిల్లలు రాత్రి నుంచి తల్లి కోసం తల్లడిల్లుతోన్న ఘటన కంటతడి పెట్టిస్తోంది. ఎలాగైనా వారిని తిరిగి తీసుకురావాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



# యూరియా కొరత వల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల పై కేంద్ర మంత్రిని కలిసి ఎం.పీ. గడ్డం వంశీకృష్ణ

**జై భీమ్ న్యూస్ న్యూఢిల్లీ**



తెలంగాణలో యూరియా కొరత వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులపై కాంగ్రెస్ ఎంపీలు న్యూ ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రైతుల గోడును బలంగా వినిపించారు. వంశీకృష్ణ చెప్పిన ముఖ్యాంశాలు: గత మూడు నెలల నుంచి సీఎం రేవంత్ రెడ్డి , తుమ్మల , మేము ఎంపీలు. నిరంతరం ఒత్తిడి తెచ్చినా యూరియా సమస్య ఇంకా అలాగే ఉందని స్పష్టం చేశారు. ఓటు చోరీ" కాదండి, ఇప్పుడైతే బీజేపీ వాళ్లు "యూరియా చోరీ" చేస్తున్నారు అని సూటిగా ధ్వజమెత్తారు. ఆర్.ఎఫ్.సి.ఎల్. (రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ) గురించి మాట్లాడుతూ డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఎంపీగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ తో మాట్లాడి 10 వేల కోట్ల రుణమాఫీ చేయించి ఫ్యాక్టరీ మళ్లీ స్టార్ట్ అయ్యేలా చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మేక్ ఇన్ ఇండియా పేరుతో ఫ్యాక్టరీ పూర్తిగా మిస్ మేనేజ్‌మెంట్‌కి గురైందని 12 లక్షల టన్నుల ప్రొడక్షన్ చేయాల్సిన చోట 9 లక్షల టన్నులే వస్తున్నాయి. అని ఆవేదన వ్యక్తం చేశారు.

# బుగ్గన అసత్య కథనాలు

## బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ విజయ్‌కుమార్

**విజయవాడ,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

'కాగ్' నివేదికపై వైకాపా నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డివి మభ్య పెట్టే మాటలేనని ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. వైకాపాకు అర్థం కాక అంకెలను తారుమారు చేస్తోందని విమర్శించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జీఎస్టీ మొదలుకొని అన్నింటినీ కూటమి ప్రభుత్వంలో తక్కువ అని చెప్పడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన సొంత ఆదాయాన్ని కూడా కలిపేసుకొని గత వైకాపా ప్రభుత్వానికి బాగా ఆదాయం వచ్చినట్లు- బుగ్గన మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

## సంపాదకీయం

# పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై చర్చించాలి !

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారం రచ్చ కొనసాగుతోంది. నిజంగానే ఇందులో లోపాలు ఉంటే పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. అందుకు బీహార్ ఎన్నికల సంఘం వెంటనే కార్యాచరణకు దిగాల్సి ఉంది. ఎందుకంటే దేశంలో ఇన్నేళ్లయినా సమగ్ర ఓటు విధానం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు ప్రమేయంతో మార్పులు, చేర్పులు చేయడం అలవాట య్యింది. వ్యవస్థీకృత లోపాలకు ఇన్నేళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీది ప్రధాన బాధ్యత. అలాగే దానిని కొనసాగిస్తున్న బిజెపిది కూడా. ఈ రెండు పార్టీల పాలనలో కేంద్ర ఎన్నికల సంఘం సర్వస్వతంత్రంగా పని చేయకుండా డమ్మీ పాత్రను పోషించేలా తయారయ్యింది. అలాగే గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న మోడీ కూడా ఎన్నికల సంఘాన్ని పటిష్టం చేయకుండా, మరింతగా దిగజారేలా చేస్తూ వచ్చారు. నిజానికి ఓటరు కార్డును పక్కాగా, పకడ్బందీగా రూపొందించడం పెద్ద పనికాదు. ఆధార్, పాన్ కార్డు తరహాలో పక్కాగా ఓటరు కార్డును రూపొందించవచ్చు. కానీ ఎన్నికల సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే ఎన్నికల సంఘం తీరుపై కారాలు మిరియాలు నూరుతున్న రాహుల్ ఎందుకు ఎన్నికల సంస్కరణల పై మాట్లాడడం లేదు. ఎందుకు నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఎందుకు పార్లమెంటులో చర్చకు దిగడం లేదు. కేవలం బీహార్ విషయమే గాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాడడం ద్వారా, విపక్షనేతగా తన సత్తా చాటుకోవాలి. అలా కాకుండా బీహార్ జాబితాను ముందేసుకుని మాట్లాడితే, ఆ రాష్ట్ర ఎన్నికలు ముగిసాక సమస్య మళ్లీ మొదటికే వస్తుంది. ఎన్నికల జాబితాలో ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయడం, ఒకే ఇంటినూ వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ఒకే ఇంట్లో ఉన్నవారికి వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఓటు కల్పించడం చూస్తున్నాం. నిజానికి దొంగ ఓట్ల సమస్య కూడా ఉంది. దొంగ ఓట్లు వేస్తే ఉరిశిక్ష విధించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయేలా చేయాలి. తెలంగానలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఈ విషయంలో రాహుల్ ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలి. అందుకే ఎన్నికల సంస్కరణలపై రాహుల్ ముందు మాట్లాడాలి. ప్రతిపక్షనేతగా బాధ్యత తీసుకోవాలి. మోడీ సర్కార్‌ను నిలదీయడం కాదు. దేశ భవిష్యత్ కోసం బాధ్యతగల ప్రతిపక్ష నేతగా మాట్లాడాలి. పటిష్టమైన ఎన్నికల విధానం అమలు కావాలంటే సంస్కరణలు రావాలి. ఇందులో ఉన్న లోటుపాట్లకు సంబంధించి అన్ని విషయాల్లో చర్చ జరగాలి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగేలా రాహుల్ బాధ్యత తీసుకోవాలి. ఈ పని ఇన్నేళ్లుగా ఎందుకు చేయడం లేదన్నది గమనించాలి. ఇకపోతే ఒక్క శేషన్ కాలంలోనే ఎన్నికల సంఘం గట్టిగా పనిచేసింది. బీహార్ జాబితా వ్యవహారపై సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం భారత ఎన్నికల సంఘం రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలని తెలిపింది. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలని కూడా పేర్కొంది. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగు తోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. జననమరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సమర్థనీయమే. డబుల్ ఓట్లు ఉన్నా, పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా తొలగించాల్సిందే. అందుకు ప్రజలను కూడా బధ్యులు చేయాలి. అలాగే 18 సంవత్సరాల నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం కూడా ముఖ్యమే. ఇకపోతే బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో ఎందుకు పూర్తి చేశారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించి నట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించు కున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది. నిజంగానే ఇది నిజమైతే సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం వివరాలు ప్రకటించాలి. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఎన్నికల సంఘం నిర్ణయించడానికి గల ఆధారాలు ఇవ్వాలి. కానీ ప్రస్తుత సవరణ తరవాత తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటేసేందుకు లేకుండా పోయిందన్న భయంలో ఉన్నారు. నిజానికి ఇలాంటి చిన్నిచిన్న సమస్యలను కూడా పట్టించుకోకుండా ఎన్నికల సంఘం తన పనితీరును కొనసాగించడం సరికాదు. అందుకే ఎన్నికల సంఘం చట్టబద్ధమైన సంస్థగా వ్యవహరించడం లేదన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. ఎవరికో ఒకరికి వత్తాసు పలికేందుకు ఎన్నికల సంఘం పనిచేయరాదు. జవాబుదారీ తనం ముఖ్యం. తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని గుర్తించాల్సిందే. అలాగే తప్పులు జరిగినప్పుడు ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా కూడా ఉండాలి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసి, పార్లమెంట్‌ను బహిష్క రించడం సరికాదు. కేవలం వాయిదా తీర్మానంలోనే చర్చించాలన్న మూర్ఖపు వాదనా సరికాదు. బీహార్‌తో పాటు మొత్తం ఎన్నికల సంస్కరణలపైనే పెద్ద చర్చ జరగాల్సి ఉంది. దీనికి రాహుల లేదా ఇండియా కూటమి నేతలు సిద్దం కావాలి. పార్లమెంటులో చర్చించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా చర్చకు వెళ్లాలి. పార్లమెంట్ బహిష్కరణలు, ర్యాలీలు, విమర్శలు, ధర్నాలు,పాదయాత్రలు వంటివన్నీ పాతపద్దతులు. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి మాత్రమే. పార్లమెంటులో చర్చ ద్వారా రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. మోడీ ప్రభుత్వంతప్పిదాలు ఉంటే నిలదీయండి. అలాగే గతంలో తమ పాలనకాలంలో జరిగిన తప్పులంటే క్షమాపణలు కోరండి.

## చింతపల్లి నుండి పాడేరుకి స్తంభించిన రాకపోకలు

**విజయనగరం,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

అల్లూరి ఏజెన్సీలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి.. మత్స్య గడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పరివాహక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి... పలుచోట్ల వరి పొలాలు వర్షపు నీటితో కొట్టు-కుపోయాయి... పాడేరు నుండి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారి వద్ద కల్వర్టుపై నుండి కొండబవాగు ప్రవహించడంతో చింతపల్లి నుండి పాడేరుకి రాకపోకలు స్తంభించాయి... పెదబయలు మండలంలో వరదని పుట్టు- వద్ద వాగు ఉధృతి అధికంగా ఉండడంతో 50 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.. హుకుంపేట మండలం చేదుపుట్టు- వద్ద వంతెన పైనుండి నీరు ప్రవహించడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి... పెదబయలు మండలంలో జామి కూడా వద్ద కొండ వాగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో స్థానిక గిరిజనులు గ్రామాలకు పరిమితమయ్యారు... ముంచంగిపుట్టు- మండలంలో ఉబెంగుల లక్ష్మీపురం రంగబయలు వంటి ప్రాంతాల వద్ద కొండవాగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో స్థానిక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు... ఏజెన్సీలో పలు పర్యటక జలపాతాలు వద్ద నీటి ఉధృతి పెరగడంతో ప్రమాదకరంగా జలపాతాలు దర్శనమిస్తున్నాయి...

# నేడే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్

**విశ్వవిద్యాలయంలో సైన్స్ పరిజ్ఞానానికి కొదవలేదు**

**సైన్స్ కాంగ్రెస్ నిర్వాహన ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాం**

**సర్వం సన్నద్ధం నిర్వహణ తరువాయి**

**ప్రతిష్టాత్మక తెలంగాణ సైన్సు కాంగ్రెస్ - 2025ని విజయవంతం చేద్దాం"**

**సైన్స్ కాంగ్రెస్ చైర్మన్ కేయూ వీసి ఆచార్య ప్రతాపరెడ్డి**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సైన్స్ కాంగ్రెస్ ను విజయవంతం చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ కమిటీ చైర్మన్,కేయూ వీసి ఆచార్య కే ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం కాకతీయ క్యాంపస్ లోని కామర్స్ సెమినార్ హాల్ లో నిర్వహించిన పత్రిక సమావేశంలో పాల్గొని సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ కార్యక్రమాలు చేపడుతున్న విశాల గురించి ప్రస్ఫుటంగా వివరించారు.ఈ సందర్భంగా హాజరైన పాత్రికేయ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఆగస్టు 19 నుండి 21 వరకు జరిగే "తెలంగాణ సైన్సు కాంగ్రెస్ - 2025" వివరాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోల్డ్ జూబిలీ ప్రారంభ సంవత్సరం సందర్భంగా ఇదే కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ సైన్సు కాంగ్రెస్ జరగటం గర్వకారణమని అన్నారు. ఈ సమావేశంలో, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షులు ఆచార్య సి.హెచ్ మోహన్ రావు, కార్యదర్శి ఆచార్య ఎస్. సత్యనారాయణ, ట్రెజరర్ ఆచార్య ఎస్.ఎం. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల సైన్సు కాంగ్రెస్ ప్రారంభ సమావేశానికి డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్, భారత ప్రభుత్వం రక్షణ మంత్రిత్వశాఖ శాస్త్రీయ సలహాదారు డా. జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇప్పటి వరకు 750 అబస్ట్రాక్ట్స్ అందాయి. 626 మంది తెలంగాణా సైన్సు కాంగ్రెస్ లో పాల్గొనటానికి నమోదు చేసుకున్నారు అన్నారు, , ఇంకా పలువురు స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక సైన్సు కాంగ్రెస్ లో 2 ప్లీనరీ సెషన్లు, వాటిలో 5 విస్తృత ఉపన్యాసాలు ఉంటాయి, 5 థీమాటిక్ ఇంటివైటెడ్ టాక్స్‌లో మొత్తం 65 ఉపన్యాసాలు, జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు, 16 ఎంపిక చేసిన లెక్చర్లు ప్రత్యేక అంశాలపై ప్రస్తుత తరానికి మార్గదర్శకంగా ఉంటాయి, విద్యార్థుల కోసం ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్లు, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలు ఏర్పాటు చేయబడతాయి. అలాగే సైంటిఫిక్ ఎగ్జిబిషన్ పాఠశాలల సైన్స్ టీచర్ల కోసం ప్రత్యేక సెషన్లు, ఇస్రో, డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహిస్తారు.భారతదేశం తొలి ఉపగ్రహం "అర్యభట్ట" నింగిలోకి వెళ్ళి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం కావటం యాదృచ్ఛికం, ఈ సైన్సు కాంగ్రెస్ జరగడం విశిష్టతను పొందిందని పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో యూనివర్సిటీ కే.హబ్ మరియు రాష్ట్ర టీ.హబ్ కలిసి గోల్డెన్ జూబిలీ కిక్‌స్టార్ట్ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, నిర్మాణాలు కొత్త ప్రాజెక్టులపై ప్రతిపాదనలు పంపినట్లు కూడా తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ సైన్సు కాంగ్రెస్ - 2025 కమిటీల బాధ్యతలు వహిస్తున్న సభ్యులు, మీడియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్ కన్వీనర్ ఆచార్య బి వెంకట్రామిరెడ్డి..

నేటి నుండి కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్న సైన్స్ కాంగ్రెస్ నిర్వాహన గూర్చి నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆచార్య బి వెంకట్రామిరెడ్డి స్పందిస్తూ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైన్స్ పట్ల విస్తృతమైన అవగాహన కల్పించే ఆస్కారం లభిస్తుందన్నారు.దీనిని యంగ్ ఇండియా సైన్స్ కాంగ్రెస్ గా కూడా పరిగణించవచ్చని సూచించారు.సైన్స్ పరిజ్ఞానం కలిగిన అధ్యాపకులచే విద్యార్థులకు శిక్షణలు అందించబడతాయన్నారు.సైన్స్ పట్ల అనుభవ పరిజ్ఞానం కలిగిన నిపుణులు పరిశోధన అంశాల పట్ల విస్తృతమైన పాఠ్యాంశాలను విభాగాల వారీగా టాపిక్లను ఎంచుకొని బోధిస్తారన్నారు.సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అనుమతులు మంజూరు చేసిన కేయూ ఉపకులపతి ఆచార్యకే ప్రతాపరెడ్డి రిజిస్ట్రార్ వి.రామచంద్రం జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రతినిధులు రాష్ట్ర సైన్స్ కాంగ్రెస్ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సైన్స్ కాంగ్రెస్ కమిటీ ప్రతి సభ్యుడు విశిష్టతతో కూడిన సేవలు అందిస్తూ సకాలంలో పనులు చేసినందున నేటి నుండి జరగబోయే సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను అద్భుతంగా నిర్వహించగలమని ధీమా వ్యక్తం చేశారు.



## మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు

**బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు**

**రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి**

**బిసి రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు**

**సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనలో సిఎం**

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**



బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. హుస్నాబాద్‌లోని పాపన్న కోటను లీజుకు ఇచ్చిందని, తాము అయితే ఆ కోటను సంరక్షించడానికి చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పోటీ-చేయించడం కూడా అదే భావనలోనుంచే జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబాన్ని దేశానికి గొప్ప వరంగా అభివర్ణిస్తూ.. వారిచ్చే హామీ శిలాశాసనం లాంటిదేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సూచించినట్లు-గా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణనను నిబద్ధతతో పూర్తి చేసామని, తాము చేసిన సర్వేలో తప్పు ఎక్కడ ఉందో చూపించమని అసెంబ్లీలోనే సవాల్ చేశామని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తీసుకున్న రాజకీయ, న్యాయ చర్యలను సీఎం వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపినప్పటికీ అది ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. తాము తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారని, కేంద్ర స్థాయిలో దానికి ఆమోదం వచ్చేలా చూడాల్సిన కేంద్ర నేతలు వాదనలతో కాలం గడుపుతున్నారని ఆక్షేపించారు. 2018లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన చట్టమే ప్రస్తుతం 50 శాతం దాటి రిజర్వేషన్లు ఇవ్వడంలో అడ్డంకిగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మత ప్రాతిపదికన ఏ రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. తాము పంపిన బిల్లు గానీ, ఆర్డినెన్స్ గానీ మతాధారిత రిజర్వేషన్లను ప్రతిపాదించలేదని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం




**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండల కేంద్రంలో బీజేపీ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు.రాహుల్ గాంధీ బీజేపీ పార్టీ ఓట్లు చోరీ చేసిందని అసత్య ఆరోపణలు చేస్తూ అల్లర్లు సృష్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ దేశ ద్రోహం చట్టం క్రింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు పొన్నాల రాజు, మడ్డి రవితేజ మండల సెక్రటరీ ఆడెపు విక్రమ్ జిల్లా నాయకులు గుండెకారి కోటేశ్వరరావు బొల్లపెల్లి మహేష్ ఆడెపు భాస్కర్ సూదుల రవీందర్ రెడ్డి తాళ్లపల్లి వెంకటనారాయణ అనుముల ఆగరెడ్డి కొట్టం మోహన్ గట్ల శ్రీను అమరావది ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోడీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్

**ట్రంప్‌తో చర్చల వివరాలు పంచుకున్న అధ్యక్షుడు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

అనూహ్యంగా మరోమారు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడారు. ట్రంప్‌తో చర్చల వివరాలను చర్చించారు. సోమవారం పుతిన్ మోడీకి ఫోన్ చేసి మాట్లాడడం విశేషం. రష్యా అధ్యక్షుడు పుతిన్డు ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా వేదికగా జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ప్రధాని మోదీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. డొనాల్డ్ ట్రంప్ తో అలాస్కా భేటీ-కి సంబంధించిన వివరాలను పంచుకున్నందుకు పుతిన్‌కు ధన్యవాదాలు. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగానే పరిష్కరించుకోవాలని భారత్ మొదటినుంచి పిలుపునిస్తోంది. ఈ విషయంలో అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇస్తాం అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ, పుతిన్‌లు మాట్లాడుకోవడం పది రోజుల్లో ఇది రెండోసారి. ఈ నెల 8న కూడా ఇరునేతలు ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను మోదీకి పుతిన్ వివరించినట్లు-తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు పీఎంవో వెల్లడించింది.



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సామాన్యుడి ఆయుధంగా

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి






**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**జై భీమ్ న్యూస్ వరంగల్**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ డా సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ డా సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి పాల్గొని శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజల కోసం పోరాడిన నేతగా పేరుగాంచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు ఈనాటి సమాజానికి మార్గదర్శకాలు కావాలని, ఆయన చూపిన ధైర్యం, తెగువ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని, వారి ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. మన పూర్వీకుల జీవన పద్ధతుల్ని, కృషిని ప్రతిబింబించే ఈ వృత్తులను మరువకుండా, తదుపరి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, గౌడ సంఘ నాయకులు గట్టు రమేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ గౌడ్, రాందాస్ గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, చిర్ర రాజు గౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, గట్టు రమేష్ గౌడ్, కోలా రాజేష్ కుమార్ గౌడ్,అనంతల రమేష్ గౌడు, సుధాకర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు

**సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**జనగాం జిల్లా జై భీమ్ న్యూస్**

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతీ ఒక్కరు అయన అడుగు జాడల్లో నడవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతిని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. బడుగులను ఐక్యం చేసి, ప్రత్యేక సైన్యం ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటను జయించిన సర్దార్ పాపన్నను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దొరలు, పెత్తందార్ల ఆదిపత్యానికి, అణచివేతకు ఎదురొడ్డి పోరాడిన వీరుడు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిత్యం పరితపించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని వెల్లడించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేయనున్నారని తెలిపారు. గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గౌడ కులస్తులు, గీతా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తిలో ఎరువుల కోసం రైతుల ఆందోళన ధర్నా




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హైవే రోడ్డుపైన రైతులు ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువులు సకాలంలో అందించడం లేదని ఆవేదన చెందుతూ ధర్నా రాస్తారోకో చేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎరువుల కోసం పాస్ బుక్కులు పట్టుకొని క్యూలైన్లో నిలబడే వాళ్లం అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనే ఉంది తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ఎరువుల కొరత లేకుండా రైతులకు రైతు బంధుగా నిలిచి అండగా ఉన్నారు. రైతులు ఎరువుల కోసం రోడ్డు ఎక్కే పరిస్థితి లేకుండా చేశాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దగ్గరికి వస్తున్న పరిస్థితిలో మళ్లీ పాత కాలం మాకు గుర్తు చేశారు. ఎరువులో రామచంద్రా అనీ రైతులు అల్లాడే పరిస్థితి తీసుకొచ్చారు రైతుల పైన అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎరువుల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం రైతును రాజు చేస్తా అని సరిపడ ఎరువులు లేకుండా చేసిందని అన్నారు. బస్తాల కోసం క్యూ లైన్ లో నిలబడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నిలబడితే అరకోర ఒకటి రెండు ఇస్తే మరి ఎలా చల్లాలి సరిపోవడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. కెసిఆర్ హయాంలో ఒక సీజన్ కు సరిపడే సరఫరా ముందుగా నిలువ చేసుకునేవారు రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అందించేవారు అని అన్నారు ఓట్లేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎరువుల బస్తాలు సరిపడ ఇవ్వడంలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా రైతుల పక్షపాతిగా నిలబడి ఎరువుల కొరత లేకుండా చూడాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**హన్మకొండ జిల్లా(పరకాల) జై భీమ్ న్యూస్**

సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న నిజమైన ప్రజా యోధుడు అని,కుల, మత, వర్గ భేదాలు లేకుండా అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారు అని అన్నారు.అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పాపన్న స్ఫూర్తి చిరస్థాయి అని,ఆయన ధైర్యసాహసాలు ఈ రోజు కూడా మనందరికీ స్ఫూర్తిదాయకం అని,పాపన్న ఆత్మస్ఫూర్తి ప్రజల్లో న్యాయం,సమానత్వం కోసం పోరాడే తపన కలిగించాలి అన్నారు.



## కాట్రపల్లి రోడ్లు బురదమయం



**జై భీమ్ న్యూస్ మహబూబాబాద్**

ఎం.సి. పి. ఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున గ్రామాల అభి వృద్ధిని గాలికి వదిలేసి నిర్లక్ష్యం వహి స్తున్న చేతగాని ఎమ్మెల్యే మురళి నాయ క్ రాజీనామా చేయాలని ఎం.సి. పి.ఐ.(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామం నుండి ఒక ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ.... కాట్రపల్లి ప్రజలు ఇతర అవసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు రోడ్లు మొత్తం బురద మాయమయ్యే పరిస్థితి ఏర్పడింది ఎన్ని ప్రభుత్వాలు మారినా మా కాట్రపల్లి అభివృద్ధి మాత్రం జరగడం లేదు కాట్రపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ వల్ల అందులో నడిచే లారీలు కేసముద్రం ప్రధాన రహదారిపై తరచుగా నడవడం వల్ల రోడ్డు మొత్తం పాడైపోయింది పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు పక్క గ్రామంలోనే ప్రభుత్వ సలహాదారుడు అయినటువంటి వేం నరేందర్ రెడ్డి దృష్టి కూడా చాలాసార్లు తీసుకెళ్లడం జరిగింది వారు కూడా నిమ్మకు నెరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు స్థానిక ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధి గాలికి వదిలేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ వర్గ పోరుతో గ్రామాలలో అభివృద్ధికుంటుపడిందని వారన్నారు ఇప్పటికైనా గ్రామాలను అభివృద్ధి చేసి కాట్రపల్లి కేసముద్రం రహదారిని తక్షణమే వేయాలని వారు ఎమ్మెల్యే ని కోరారు. లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరిక జారీ చేశారు.

## ఢిల్లీలో నిరసనవ్యక్తం చేస్తున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య






**జై భీమ్న్యూస్ న్యూ ఢిల్లీ**

ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీల ప్రతిపక్ష పార్టీల ఎంపీలతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నిరసన వ్యక్తం చేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం పార్లమెంట్ భవనం వద్ద నిరసన చేపట్టారు. ఓట్ల దొంగతనం ఆపేయాలంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ఎంపీ డా. కడియం కావ్య నినదించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ... తమది రాజకీయ పోరు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చేస్తున్న యుద్ధమని అన్నారు. దేశంలో ఓట్లను కొల్లగొట్టి బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తాము పోరాడుతున్నామని చెప్పారు. తమకు స్వచ్ఛమైన, నిజమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న దానిపై తాము పోరాడుతున్నామని, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వాస్తవాలనుదేశ ప్రజలకు తెలియజేశారని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనం ఆగే వరకు మా నిరసన కొనసాగుతుందని ఎం.పీ డా.కడియం. కావ్య స్పష్టం చేశారు.

## బాధితులు నిర్భయంగా తమ సమస్యలు తెలపాలి

**భూపాలపల్లి ఎస్పీ. కిరణ్ కారే ఐపీఎస్**

**భూపాలపల్లి, జై భీమ్ న్యూస్**

బాధితులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ సమస్యలను పోలీసులకు తెలపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖేరే ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 18 మంది నుంచి పిర్యాదులు స్వీకరించి, పలువురు బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు విని అక్కడికక్కడే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



# ఆర్.ఎస్.పి అందరివాడు

**ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వేమురి రాధాకృష్ణ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి బహిరంగ క్షమాపణ చెప్పాలని ధర్నా**
**ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి దళిత నాయకుడు అనే ముద్ర వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.**
**స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ స్వేరో**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్.ఎస్.యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ని ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ సాయంత్రం ఏడు గంటలకు డిబేట్ లో పాల్గొనమని చెప్పి ఏబీఎన్ న్యూస్ ఛానల్ లో స్క్రోలింగ్ దళిత నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేవలం దళితుల కోసమే పనిచేయడం లేదని ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ఛానల్ అధిపతి అయినటువంటి ఆంధ్రప్రదేశ్ వేమురి రాధాకృష్ణన్ కి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ఎంతో మంది పేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు అగ్రవర్ణాల్లో పేదల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడిని దళిత నాయకుడు అనే ముద్ర వేయడాన్ని సిగ్గుచేటుగా భావిస్తున్నాను, అదేవిధంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన ఉద్యోగ వృత్తిలో ఉన్నప్పుడు ఎంతోమంది పేదలకు కులాలకు,మతాలకు అతీతంగా సభ్యుండ వర్గాలకు మేలు చేసిన వ్యక్తి ని పట్టుకొని సోమవారం ఆంధ్రజ్యోతి మెయిన్ స్ట్రీమ్ మీడియా దళిత నాయకుడు అని అవమానిస్తున్న వేముల రాధాకృష్ణ తన మీడియా ద్వారా బహిరంగంగా క్షమాపణలు కోరాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ ఉద్యమంలో తను పోలీస్ ఉద్యోగంలో వండుకుంటూ తెలంగాణ వాదం వైపు నిలిచిన వ్యక్తి ఎంతోమంది తెలంగాణ కోసం అమరులైన విద్యార్థుల శవాలను తన భుజాల మీద మోసిన వ్యక్తి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అదేవిధంగా ఎవరెస్టు శిఖరం ఎక్కించిన మలవతు పూర్ణ, ఆనందుల విజయాన్ని కూడా తనకే దక్కుతుంది, అంతేకాకుండా ఎంతోమంది విద్యార్థులను అజీమ్ ప్రేమ్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, ఐఏఎస్ ఐపీఎస్ , పైలెట్ మరియు ఇతరాంతర ఉద్యోగాలు పొందే విధంగా తయారుచేసిన వ్యక్తి ఆర్ ఎస్ పి ఇతర దేశాలకు పై చదువుల కొరకు పంపించిన ఘనత కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కి దక్కుతుంది ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అదేవిధంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఒక్కసారి తన మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వేసేముందు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ యొక్క స్టేటస్ ఏంది తన ఉద్యోగ వృత్తిలో ఏ విధంగా పని చేసిండు రాజకీయ రంగంలోకి వచ్చాక ఎలా పనిచేస్తున్నాడో కూడా గమనించాల్సిన అవసరం ఉంది తాను స్వేరోస్ నెట్వర్క్ ను స్థాపించి ఇతర దేశాలలో కూడా ఆ నెట్వర్క్ ను విస్తరించి పేద ప్రజల పక్షాన అండగా నిలుస్తున్న స్వేరోస్ నెట్వర్క్ ఘనత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారికి దక్కుతుంది తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు చెట్టుపల్లి శివకుమార్, బన్నీ, వంశీ, శ్రావణ్, కృష్ణ ,రాజేష్, సురేష్, కిరణ్, మహేష్, రాకేష్, సుఖేష్, సిద్దు ,ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల డ్రాప్ అవుట్‌ల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**జై భీమ్ న్యూస్./న్యూ ఢిల్లీ**

లోక్ సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు దేశంలో పాఠశాల డ్రాప్ అవుట్ ల అంశంపై దృష్టి సారించారు. ఈ సమస్యను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రశ్నించారు. లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా పాఠశాల డ్రాప్ అవుట్ లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

**యూ.డీ.ఐ.ఎస్.ఈ ంద్వారా పర్యవేక్షణ..**

2019-20 నుండి 2023-24 వరకు ప్రాథమిక, పైప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లో విద్యార్థుల డ్రాపవుట్లపై యూడైస్ ప్లస్ (యూ. డీ.ఐ.ఎస్.ఈ.ం) ద్వారా గణాంకాలు సేకరిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఈ పోర్టల్‌లో రాష్ట్రాలవారీగా, లింగం, వర్గాల వారీగా సమాచారం ఉండటమే కాకుండా, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి పాఠశాల సౌకర్యాల వివరాలు కూడా నమోదు అవుతున్నాయని వివరించారు.

**పి.ఏ.ఆర్.కే. ఏ.ఎస్.హెచ్ సర్వేక్షణతో విద్యా లోపాల గుర్తింపు..**

పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ 2024 కింద గతేడాది డిసెంబరులో ఎన్.సి.ఈ.ఆర్.టీ. ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 74 వేలకుపైగా పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులపై సామర్థ్య పరీక్ష నిర్వహించామని తెలిపారు. 781 జిల్లాలను కవర్ చేసిన ఈ సర్వే ద్వారా విద్యార్థులలో ఉన్న విద్యా లోపాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు రిపోర్ట్ కార్డులు తయారు చేసినట్టు చెప్పారు.

**డ్రాపవుట్ల కారణాలపై దృష్టి..**

ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, పాఠ్యభారం వంటి అంశాల వల్ల డ్రాపవుట్లు ఎక్కువగా జరుగుతున్నాయని 2017-18 నేషనల్ సాంపిల్ సర్వేలో తేలిందని మంత్రి గుర్తుచేశారు. దీనికి పరిష్కారంగా సమగ్ర శిక్షా పథకం కింద పాఠశాలలు, తరగతి గదులు, వసతి గృహాలు (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు) నిర్మాణానికి కేంద్రం నిధులు అందిస్తోందన్నారు. అదనంగా విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, రవాణా భత్యం, నమోదు డ్రైవ్‌లు అందిస్తున్నట్టు వివరించారు.

**భోజనం – స్కాలర్‌షిప్ పథకాలు..**

ప్రాథమిక విద్యార్థులకు ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకం కింద ప్రతిరోజూ వేడి వంట భోజనం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద 09 తరగతి కొత్తగా చేరిన లక్షమంది విద్యార్థులకు వార్షికంగా రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ ఇచ్చి, 12 తరగతి వరకు కొనసాగిస్తున్నట్టు చెప్పారు.

**రాష్ట్రాలకు తోడ్పాటు..**

“ఈ చర్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వాల కృషికి తోడ్పడే విధంగా ఉంటాయి. వెనుకబడిన, బలహీన వర్గాల విద్యార్థులను పాఠశాలల్లో కొనసాగేలా చూడడమే మా ప్రధాన లక్ష్యం” అని మంత్రి జయంత్ చౌదరి లోక్‌సభలో స్పష్టం చేశారు.



# పోలీస్ నిబంధనలు పాటిస్తూ భక్తి శ్రద్దలతో గణేష్ నవ రాత్రులు జరుపుకుందాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

పోలీసులు సూచించిన నిబంధనలను పాటిస్తూ భక్తి శ్రద్దలతో గణేష్ నవ రాత్రులను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ నిర్వాహకులకు తెలిపారు. రాబోవు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ట్రై సిటీ పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలను ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు సన్నద్ధం అవుతుండడంతో ముందుగా గణేష్ నవ రాత్రి నిర్వహకులు పాటించాల్సిన నిబంధనలపై పోలీస్ పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేస్తూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పసరిగా ముందుగా పోలీసుల అనుమతి పొందాల్సి ఉంటుందని. గణేష్ మండపాల నిర్వహకులు పోలీసుల ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్ సైట్ kwwsv=22srllfhsruwdl1wsrllfh1jry1lq ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు.గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో లేదా స్థల యజమానితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి.షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి.గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు,ఇసుక ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం,పేకాట అడటం,లక్కీ డ్రాలు నిర్వహించడం,అసభ్యకరమైన నృత్యాలు ఏర్పాటు,అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం,పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు.మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు,ప్లాస్టిక్ సంచులు,వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. పోలీస్ కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.




# గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించిన ఎమ్మెల్యే కడియం**
**విద్యార్థినిలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే**
**వచ్చే విద్యా సంవత్సరం నుండి జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్**
**వెంటనే సంబంధిత చర్యలు తీసుకోవాలని ఐటిడీఏ పివోకు సూచించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**





**జనగాం జిల్లా జై భీమ్ న్యూస్**

గిరిజన బాలికల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న గడ్డి, చెట్ల పొదలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనాలను, వాటర్ ప్లాంట్, కిచెన్ పరిసరాలను, విద్యార్థులను భోజనాలను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూమ్ లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పవడుతున్నారా, క్లాసులు సరిగా జరుగుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటిడీఏ పిఓకి ఫోన్ చేసి స్టేషన్ ఘనపూర్ గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలనీ అందుకు సంబందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండే జూనియర్ కళాశాల ప్రారంభం కావాలని అన్నారు. జూనియర్ కళాశాల నిర్వహణకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ డిసిపిగా బాధ్యతలు చేపట్టిన గుణశేఖర్

**జై భీమ్ న్యూస్ /హన్మకొండ :**




సైబరాబాద్ కమిషనరేట్ పరిధి లోని మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ పని చేస్తున్న గుణశేఖర్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీ పై సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ నూతన డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన డీసీపీని అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసారు.

# కేసీఆర్ పాలనే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష

**విశ్వ నగరాల సరసన హైదరాబాదును చేర్చిన ఘనత కేటీఆర్‌కి దక్కుతుంది**
**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మోతీ నగర్, రెహ్మత్ నగర్ డివిజన్ల పార్టీ ఇంచార్జ్ దాస్యం వినయ్ భాస్కర్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**





జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మరో ఇంచార్జ్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కలిసి మోతీ నగర్, రెహ్మత్ నగర్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్యులతో హైదరాబాద్ మోతీ నగర్ లోని ఒక ప్రైవేట్ హాల్ లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ అకాల మరణం పార్టీకి తీరనిలోటని, వారి అకాల మరణంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైందని అన్నారు. జూబ్లీహిల్స్ ఓటర్ల మన్నన బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గులాబీ సైనికులంతా కష్టపడి ఈ ఉప ఎన్నికలల్లో కారు గుర్తుకు ఓటు వేయించి, మళ్ళీ కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కాంగ్రెస్ మోసపూరిత, అమలు చేయని హామీలను, అసమర్థ పాలన ను ప్రజలకు వివరించాలని సూచించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో బీఆర్ఎస్ పాలన, కేసీఆర్, కేటీఆర్ పాత్ర ను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుదాం అని అన్నారు. హైదరాబాద్ లోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలంటే బీఆర్ఎస్ పార్టీ యే గెలవాలని అన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

## గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న


**సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిర్ర విజయ్ కుమార్ గౌడ్**



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

తెలంగాణ గడ్డ మీద జన్మించిన గొప్ప బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిర్ర విజయ్ కుమార్ అన్నారు. హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నకు సమూచిత స్థానం కల్పిస్తూ హైదరాబాద్ నగరం నడిబొడ్డున సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారని, ఆయన పోరాట స్పూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, గౌడన్నల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ముంజ నవీన్ కుమార్, మాచర్ల మహేందర్, చింత మహేందర్, బుర్ర మహేష్, సతీష్, రమేష్, ముంజ అనిల్, బుర్ర లచ్చులు, ముంజ సంతోష్, రాజు, చిర్ర మహేందర్, అశోక్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



జై భీమ్ న్యూస్ హన్మకొండ

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, గౌడ సంఘం నాయకులు హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలను అధికారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా పలువురు అధికారులు, గౌడ సంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధించిన ఘనతను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, డిఆర్డివో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్, పలు శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించిన కలెక్టర్**

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన 185 వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖ అధికారులను వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరుతూ వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి వినతులను పెండింగ్ లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, తదితర శాఖల అధికారులు, పాల్గొన్నారు.



# ప్రజావాణికి 92 ఫిర్యాదులు





**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

జై భీమ్ న్యూస్ వరంగల్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 33, జిడబ్ల్యూఎంసీ 18, గృహ నిర్మాణ శాఖ 9, వైద్య ఆరోగ్య, విద్య శాఖకు 4 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించినవి 24 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాకు ఆరేంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రోడ్లు మరియు రవాణా, వైద్య ఆరోగ్య శాఖల జిల్లా అధికారులు శాఖల వారిగా అంతర్గత సమావేశాలు నిర్వహించుకొని పరిస్థితుల కనుగుణంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిడబ్ల్యూఓ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి





**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం లక్షా 13 వేల కోట్ల వ్యయం**

**రైతులు ప్రస్తుత అవసరాల మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలి**

**పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కాకుండా పటిష్ట చర్యలు**

**యూరియా, ఎరువుల లభ్యత పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి తుమ్మల**

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు లతో కలిసి యూరియా, ఎరువుల లభ్యత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాల వల్ల కొంత యూరియా సమస్య ఉందని అన్నారు. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదని అన్నారు. ఏప్రిల్ నెల నుంచి కేటాయింపుల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా కాలేదని, మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. మన దగ్గర గతంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ తో రైతులకు ఇప్పటి వరకు కొంత మేర సరఫరా చేసామని అన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ , రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇప్పటివరకు లక్షా 13 వేల కోట్లు ఖర్చు చేసిందని, యూరియా కోసం రైతులు గంటల సమయం లైన్ లో నిలబడటం వల్ల కొంత అసంతృప్తి చెందుతున్నారని మంత్రి తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, అది సక్రమంగా విక్రయం జరగాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా సరఫరా పై పత్రికలో వ్యతిరేక వార్తలు రాకుండా ముందస్తుగా పరిస్థితుల గురించి పాత్రికేయులకు వివరించాలని అన్నారు. యూరియా సరఫరా చేసేందుకు చేపట్టిన చర్యలు రైతులకు మీడియా ద్వారా తెలిసేలా చూడాలని అన్నారు. సీఎస్ కే.రామకృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక వైపు విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ యూరియా కొరత కొంత ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జియో పొలిటికల్ కారణాల వల్ల దేశానికి యూరియా సరఫరా సరఫరా దెబ్బతిందని, రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్ ప్లాంట్ లో సాంకేతిక కారణాలవల్ల ఉత్పత్తి పలుమార్లు నిలిచిపోవడం నువ్వంటే కారణాల వల్ల మన దగ్గర కొంత యూరియా కోరత ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు వచ్చే ఎరువుల సరఫరాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల కోత ఉన్నప్పటికీ, గత సంవత్సరంతో పోలిస్తే నేటికి లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అదనంగా రైతులకు సరఫరా చేశామని అన్నారు. రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వీలైనంత అధికంగా యూరియా తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు వ్యవసాయం కోసం కేటాయించిన పారిశ్రామిక అవసరాల కోసం అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కొంత సమాచారం అందించిందని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను కలెక్టర్ ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయి వరకు స్టాక్ ఎంత ఉందో రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు. మండలాల వారీగా సాగు ఎంత అవుతుంది, ఎరువుల లభ్యత బేరీజు వేసుకొని అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ సమర్థవంతంగా , శాస్త్రీయంగా కేటాయింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల రేక్ స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ కు ముందస్తుగా తెలియజేస్తామని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని అన్నారు. వ్యవసాయ అధికారులతో పాటు జిల్లాలో ఇతర ముఖ్యమైన అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ ఎరువుల డీలర్ల షాపు లను ఆకస్మిక తనిఖీ చేయాలని అన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలు జిల్లాలో ఉంటే వాటిని ఆకస్మిక తనిఖీ చేయాలని, వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన బయ్యర్స్, రెగ్యులర్ గా కొనుగోలు చేసే బయ్యర్స్ వివరాలను ట్రాక్ చేయాలని, వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా పరిశీలించాలని అన్నారు. జిల్లాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా డ్రోన్ ద్వారా నానో యూరియా, డిఏపి కాంప్లెక్స్ ప్రోత్సహించాలని సి.ఎస్ తెలిపారు. జిల్లాలో ఎరువులు, యూరియా లభ్యత, సరఫరా పై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో యూరియా కోసం అనవసరంగా రైతులు లైన్ లో నిలబడకుండా ఎప్పుడు సరఫరా చేస్తామనే అంశం స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఆదిలాబాద్, సూర్యాపేట, నిజామాబాద్, నారాయణ పేట వంటి సరిహద్దు జిల్లాలో ఇతర రాష్ట్రాల రైతులకు యూరియా అమ్మకుండా చూడాలని, మన స్టాక్ బ్లాక్ మార్కెట్ కాకుండా బోర్డర్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కే. యూ మైక్రో బయాలజీ విభాగ నూతన అధిపతిగా డాక్టర్ ఈ సుజాత నియామకం

జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్

కాకతీయ విశ్వవిద్యాలయ మైక్రో బయాలజీ విభాగ నూతన అధిపతి గా డాక్టర్ ఈ. సుజాత ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారి చేసారు, ప్రస్తుత విభాగ అధిపతి డాక్టర్ పి. వెంకటయ్య నుంచి డాక్టర్ సుజాత బాధ్యతలు స్వీకరించారు, డాక్టర్ సుజాతను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు మరియు విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు.



# నూతన్ ఛాంబర్‌ను ఆవిష్కరించిన కే.యూ వి.సి ప్రతాప్‌రెడ్డి

**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనం లోని రెండవ ఫ్లోర్ లో నిర్మితమైన వైస్ ఛాన్సలర్ ఛాంబర్ ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అని రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు, తొలత రిజిస్ట్రార్ శాలువా, బోకే తో వైస్ ఛాన్సలర్ ను అబినందించారు, వైస్ ఛాన్సలర్ కార్యాలయం మొదటి అంతస్టు నుంచి రెండవ అంతస్తు లోనికి వెళ్ళుతుంది అన్నారు, అదే విధంగా ఆ అంతస్తు లోనే వివిధ కమిటీ హాల్ లు కుడా వినియోగానికి వస్తాయి అన్నారు, ఈ కార్యక్రమం లో అబివృద్ధి అధికారి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి దూర విద్య సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, కాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఆచార్య వరలక్ష్మి, ఆచార్య గాదె సమ్మయ్య, ఆచార్య వై. నరసింహ రెడ్డి, ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, డాక్టర్ ఎన్. సుదర్శన్, ఫైనాన్సు ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ హబీబుద్దీన్, డిప్యూటీ రిజిస్ట్రార్లు పంజాల శ్రీధర్, లింగంపల్లి రాము, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రతిభా పురస్కారం అందుకోనున్న కే.యూ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎం. లింగయ్య

**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి మరియు అసిస్టెంట్ కాంట్రాక్టు ప్రొఫెసర్ డాక్టర్ ఎం. లింగయ్య, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన సథరన్ ప్రైవేటు అధ్యాపకుల సంస్థ "శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం" సంస్థ స్థాపకుడు, జాతీయ అధ్యక్షులు డాక్టర్ పయరాడ నాగయ్య చేతుల మీదుగా ఆగష్టు 31వ తేదీన గుంటూరులో ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు. ఈ అవార్డు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా. డాక్టర్ లింగయ్యను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు మరియు విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికారం కోసం పోటీపడాలి



**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

బహుజన రాజ్యాధికార దిక్సూచి సర్దార్ సర్వాయి పాపన్న" డాక్టర్ చిర్రా రాజు కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు కాకతీయ విశ్వవిద్యాలయం లోని బీసీ సెల్ డైరెక్టర్ డా. బోడిగే సతీష్ ఆధ్వర్యంలో 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు డా. చిర్ర రాజు మాట్లాడుతు దాదాపు 300 సంవత్సరాల క్రితమే బహుజన నాయకుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గోల్కొండ కేంద్రంగా పరిపాలన కొనసాగించాడని నేటితరం అదే స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం అడుగులు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే.యూ రిజిస్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మాజీ బీసీ సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో నూతన కేయూ బీసీ.సెల్ డైరెక్టర్ గా డా,,బొడిగే సతీష్ గౌడ్ బాధ్యతలు చేపట్టినారు.అనంతరం నూతన డైరెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపిన ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, ప్రొఫెసర్. మల్లారెడ్డి, ప్రొఫెసర్. ఇస్తారి, డా. కనకయ్య,డా,,సుందర రాజు యాదవ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బోనగాని యాదగిరి గౌడ్, డా. కరుణాకర్, డా. ఫిరోజ్, డా. రాజేష్, డా.ఉమశంకర్, డా. మోహన్, డా. చీకటి శ్రీను, డా.మామిడి లింగయ్య, శ్రీ జనగాం శ్రీనివాస్,డా. దేవోజీనాయక్, డా. సిద్దార్థ్, శ్రీ మౌనిక గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**దేవరుప్పుల, జై భీమ్ న్యూస్**

జనగామ జిల్లా దేవరపుల మండలం ధరావత్ తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై సృజన్ కుమార్ మాట్లాడుతూ ఐదు లీటర్ల గుడుంబా 250 లీటర్ల పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

షీ టీం ఎస్ఐ సునంద

**జై భీమ్. మహబూబాబాద్ న్యూస్**





మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్ ఐపిఎస్ ఆదేశానుసారంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంనిర్వహించడం జరిగింది మహిళల, విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం ను లేదా పోలీసులను సంప్రదిం చాలని షీ టీం ఎస్సై సునంద , మరిపెడ బంగ్లా పోలీస్ స్టేషన్ సెకండ్ ఎస్ఐ కోటేశ్వరరావు సంయుక్తంగా పోలీస్ కళాబృందంతో కలిసి 500 మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. తెలంగాణ గిరిజన సంక్షేమం గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల నందు అవగాహన కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ సునంద మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్స్, భరోసా, హ్యూమన్ ట్రాఫికింగ్ మూఢనమ్మకాలు మరియు బాల్య వివాహాలు మైనర్ డ్రైవింగ్ ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు చిన్నపిల్లల రక్షణ విషయంలో పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని,ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటాయని సూచించారు. మహిళలు, యువతు లను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని మైనర్ బాలికలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే ఫోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ పిఎస్ సిబ్బంది, పోలీస్ కళాజాత బృందం సభ్యులు, షీ టీం సిబ్బంది భరోసా లీగల్ అడ్వైజర్ సాహిత్య, కళాశాల ప్రిన్సిపల్ మాలోత్ సోమాజి అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎస్.ఎస్. ప్రీ రిపబ్లిక్ డే శిబిరానికి వాలంటీర్ల ఎంపిక

**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలోని కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. శిబిర ఎంపికలో భాగంగా వాలంటీర్లకు మొదటగా దేహదారుడ్య పరీక్షల్లో భాగంగా రన్నింగ్ పోటీలు నిర్వహించి పరేడ్ మరియు ఇంటర్వ్యూలలో ప్రతిభ కనపరిచిన ఆరుగురు వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగింది ఇందులో ముగ్గురు అమ్మాయిలను ముగ్గురు అబ్బాయిలను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాలంటీర్ల ఎంపికకు విచ్చేసిన ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం ఏం.రామకృష్ణ మాట్లాడుతూ ఈ యొక్క ప్రీ రిపబ్లిక్ డే శిబిరాన్ని అక్టోబర్ 31 నుండి నవంబర్ 9 వరకు గుజరాత్ రాష్ట్రంలోని పాటన్ జిల్లాలోని హేమచంద్ర నారాయణ నార్త్ స్టేట్ గుజరాత్ (హెచ్.ఎన్.జి.యు) విశ్వ విద్యాలయంలో నిర్వహించబడడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తెలంగాణ రాష్ట్రం తరపున జనవరి 26 న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొనే అవకాశం కల్పిస్తారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ రీజినల్ డైరెక్టరేట్ హైదరాబాద్ కార్యాలయ సూపరిడెంట్ ఏన్. సంజయ్ కుమార్, ఎన్ఎస్-ఎస్ కాకతీయ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం. నారాయణ, ప్రోగ్రాం అధికారులు అశోక్ మోరే, డాక్టర్ ఆర్.ప్రవీణ్ కుమార్, డాక్టర్ పి.రాధిక, దత్తాత్రేయ, సతీష్ చంద్ర కార్యాలయ సిబ్బంది మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లిలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పన్నెండేళ్ల బాలిక హత్య

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

కూకట్‌పల్లిలో ఘోరం జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న పన్నెండేళ్ల బాలికను అత్యంత కిరాతకంగా హత్య చేశారు. తల్లిదండ్రులు ఆఫీస్‌లకు వెళ్లిన సమయంలో చిన్నారిని చంపేసి పరారయ్యారు. కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో ఈ దారుణం జరిగింది. పేరెంట్స్ ఇంట్లో లేని సమయంలో పన్నెండేళ్ల సహస్రాణి ను పొట్టనబెట్టుకున్నారు. హత్య గురించి తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి భారీగా చేరుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటీన చేరుకున్నారు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం.. సహస్ర తల్లిదండ్రులు రేణుక, కృష్ణ ప్రైవేట్ ఉద్యోగులు. కొన్నాళ్లుగా కూకట్‌పల్లిలో నివసిస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఈ హత్య జరిగిందని తెలిపారు. కాగా, చిన్నారి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విగతజీవిగా ఉన్న తమ చిన్నారిని చూసి గుండెలవిసేలా రోధిస్తున్నారు. ఇంట్లో ఒకవేళ తమ కొడుకు కూడా ఉండి ఉంటే అతన్ని కూడా చంపేసేవారేమోనని చిన్నారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## మైనర్ బాలిక పై అత్యాచారం చేసిన నిందితుడికి 20ఎళ్ల జైలు శిక్ష

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

మైనర్ బాలిక పై అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష 15 వేల జరిమానా విధిస్తూ ఒకటో వాదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అపర్ణాదేవి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మహబూబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం బయ్యారం చిన్న తండా చెందిన బాధితురాలు బతుకుదెరువు కోసం కాజీపేట డీజిల్ కాలనీ ప్రాంతంలో మొక్కజొన్న కంకులు కాల్చి అమ్ముచుండేది. ఈమెకు నలుగురు ఆడపిల్లలు ముగ్గురు అమ్మాయిలా పెళ్లి జరిగినది. చిన్న కూతురు ఏడో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉంటుంది. అప్పుడప్పుడు తల్లి వద్ద పనులు నిర్వహిస్తూ ఉండేది. ఈ క్రమంలో పర్వతగిరి మండలం అన్నారం తండా చెందిన నిందితుడు వాంకుడు చంద్రుడు 23 సంవత్సరాలు మైనర్ బాలికతో పరిచయం పెంచుకొని డిసెంబర్ 15 2022 రాత్రి 11 గంటల 45 నిమిషాలకు ఫోన్ చేసి ఆమెను బయటికి తీసుకెళ్లేవాడు తన కూతురు కోసం తల్లి వెతకగా నిందితుడు ఆమెను రోడ్డుపై వదిలేసి వెళ్లాడు ఈ విషయమై ఎవరికైనా చెబితే నీవు నాతో తీసుకున్న ఫోటోలు అందరికీ చూస్తానని ఆమెను భయపెట్టి డు. అదేవిధంగా పలుమార్లు ఆ మైనర్ బాలికను నిందితుడు బయటకు తీసుకెళ్లి అత్యాచారాన్ని పాల్పడినట్లు బాధితురాలు కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి మహేందర్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఇట్టి కేసులో ప్రస్తుత వున్న ఇన్స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్. ఏరుకొండ సుధాకర్. కోర్టు లెసన్ ఆఫీసర్ ఏఎస్ఐ పరమేశ్వరి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. 15 మంది సాక్షులకు హోంగార్డ్ అనిల్ సమాన్లు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసెసర్ బి మల్లారెడ్డి వాదించారు. వాద ప్రతివాదాలు విన్న అనంతరం న్యాయమూర్తి పై తీర్పునిచ్చారు.

## స్కిల్స్ పెంచుకోవాలి

**జై భీమ్ న్యూస్ కే. యూ క్యాంపస్**

సిలబస్‌కు పరిమతం కావద్దు అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణం లోని సెనెట్ హాల్‌లో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ అధ్యక్షతన, బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు "ఓరియంటేషన్ కార్యక్రమం"లో ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులను, వారి తల్లి తండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు, పాఠ్యపుస్తకములతో పాటు, పాఠ్యతేరా అంశాల పై కుడా ప్రాముఖ్యత ఇవ్వాలి అన్నారు, మంచి వ్యక్తులుగా మారడానికి ఉన్న ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, గౌరవ అతిదిగా పాల్గొన్న వరంగల్ టి.జి. ఎన్.పి.డీ.సి.ఎల్ చైర్మన్ మరియు మానేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ సామజిక ప్రయోజనం కోసం, ఆచరణాత్మక పరిష్కారాలను చూపడంలో ఇంజనీర్‌ల పాత్ర ప్రధానం అన్నారు, కృత్రిమా మేధా నైపథ్యంలో నైపుణ్యాల పెంపు అవసరం అన్నారు, ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ వి. మహేందర్‌తో పాటు డాక్టర్ సి.హెచ్.రాధిక, డాక్టర్ సుమలత, డాక్టర్ అసిం ఇక్బాల్‌తో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# హీరో సూర్యతో వెంకీ అట్లూరి మూవీ

కొలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం తన 46వ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చుట్టూ ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ నటించనున్నారన్న వార్తలు ఇటీవల వైరల్ అయ్యాయి. ఈ రూమర్స్‌పై తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి స్పందిస్తూ.. అనిల్‌కపూర్‌ను మేము ఎప్పుడూ కలవలేదు. ఆయనతో ఫోన్‌లో కూడా మాట్లాడలేదు. కానీ, ఎక్కడి నుంచి ఈ వార్తలు పుట్టుకొచ్చాయో మాకు తెలియదు. ఇలాంటి రూమర్స్‌ను నమ్మకండి. అధికారికంగా మేము చెప్పిన సమాచారాన్నే నమ్మండని స్పష్టం చేశారు. 'సార్' , 'లక్కీ భాస్కర్' సినిమాల తర్వాత వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్న ఈ



సినిమా మీద అంచనాలు రెట్టింపయ్యాయి. ఇందులో మమితాబైజు హీరోయిన్‌గా, అలాగే రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ 'సూర్య 46' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోంది. మేకర్స్ ఈ సినిమాను వచ్చే 2026 వేసవిలో విడుదల చేయాలని భావిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇటీ-వల రిలీజ్ చేసిన సూర్య బర్త్ డే పోస్టర్ కు మంచి స్పందన లభించింది. ప్యూర్ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంట్టంల్గ÷నర్ గా గా వస్తున్న ఈ సినిమాకు ' విశ్వనాథం అండ్ సన్స్' అనే -టైటిల్ ను ఫిక్స్ చేశారట. కథకు తగ్గట్టు- ఈ టైటిల్ పర్ఫెక్ట్ గా సెట్ అవుతుందని అందుకే ఆ -టైటిల్ ను ఫిక్స్ చేసారని సమాచారం. త్వరలోనే ఈ సినిమా -టైటిల్ ను అఫీషియల్ గా ప్రకటించబోతున్నారట.



# రాజమౌళి చేతుల మీదుగా రావు బహద్దూర్ టీజర్

టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ ఎన్నో సినిమాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించారు.. బ్లఫ్ మాస్టర్ సినిమా తర్వాత ఆయన నటనకు చాలామంది ఫిదా అయ్యారు. ఇటీవల జీబ్రా చిత్రంతో ఆకట్టుకున్న సత్యదేవ్ ఇప్పుడు రావు బహదూర్ అనే చిత్రంతో మరింత వినోదం పంచబోతున్నాడు. ఆయన నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తున్న వారికి ఈ మూవీ సమాధానం చెప్పేల కనిపిస్తుంది. 'రావు బహదూర్' అనే -టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించాడు. ఇటీవల విడుదలైన పోస్టర్‌ని చూసి ఇది ఫాంటసీ డ్రామా కానుందా? అనే ఆసక్తి కలుగుతుంది. ఈ చిత్రాన్ని కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్నారు.'అనుమానం పెనుభూతం' అనే లైన్‌ను హైలైట్ చేస్తున్న నేపథ్యంలో ఇందులో ఊహించని ట్విస్ట్‌లు ఉంటాయని అర్ధమవుతుంది.తాజాగా మూవీ టీజర్ రాజమౌళి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్.. నాకు అనుమానం అనే భూతం పట్టిందనే ఆసక్తికర డైలాగ్‌తో ప్రారంభమైంది. సన్నివేశాలు ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. సైకలాజికల్ డ్రామాగా దీనిని తీర్చి దిద్దినట్టు- టీ-జర్ చూస్తుంటే తెలుస్తుంది. వచ్చే సమ్మర్‌కి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రం ద్వారా సత్యదేవ్ నుంచి ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం మళ్ళీ ఆయనలో చూడబోతున్నామని, మహేశ్వర ఉగ్రరూపస్య తరహా ఇంపాక్ట్‌ను వెంకటేష్ మహా మళ్ళీ అందించబోతున్నాడని అనిపిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీచక్ర ఎంటర్‌టైన్మెంట్స్, ఏ ప్లస్ ఎస్ సినిమాస్ నిర్మిస్తుండగా, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. 'రావు బహదూర్' అనేది ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ డ్రామా. దీనికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, ఎడిటింగ్ వెంకటేష్ మహానే చేశారు. స్మరణ్ సాయి సంగీతం సమకూరుస్తుండగా.. కార్తీక్ పర్మార్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి దినేష్ యాదవ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# కొదమసింహాలో ఆ ఏమోషన్ లేదు




## ఆనాటి చిరు చిరు సినిమాపై రాజమౌళి అభిప్రాయం

ప్రస్తుతం రాజమౌళి మహేశ్‌బాబుతో మూవీ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నవంబరులో ఇందుకు సంబంధించిన లుక్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. సన్నివేశాలను భావోద్వేగంగా మలిచి ప్రేక్షకుడి మదిలో చెరగని ముద్ర వేయడంలో సిద్ధహస్తులు దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి అందుకే ఆయన తీసే సినిమాలు ప్రేక్షకులను అలరించడమే కాదు, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తాయి. ఇక ఎమోషనల్ సన్నివేశాలు, హీరో ఎలివేషన్ సీన్స్ తీయడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'మగధీర' రామ్‌చరణ్ కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకుంది. అందులోని ఓ సన్నివేశం భావోద్వేగభరితంగా రావడానికి చిరంజీవి నటించిన 'కొదమ సింహం'చిత్రమే కారణమని రాజమౌళి ఓ సందర్భంలో పంచుకున్నారు. అప్పట్లో థియేటర్‌లో 'కొదమసింహం' సినిమా చూస్తున్నా. అందులో రౌడీలు చిరును పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి వెళ్లిపోతారు. అక్కడే ఉన్న ఆయన గుర్రం ఆయన నోటికి తాడు అందించి కాపాడుతుంది. ఆ సీన్ చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యా. అయితే, ఆ కష్టంలో నుంచి బయటకు వచ్చిన ఆయనకు, గుర్రానికీ అనుబంధం లేదనిపించింది. సాయం చేసిన ఒక వ్యక్తికి థ్యాంక్స్ చెప్పకపోతే ఆ భావోద్వేగం ఎలా సంపూర్ణమవు తుందనిపించింది. అది నా మైండ్‌లో అలాగే ఉండిపోయింది. ఒక ప్రేక్షకుడిగా అప్పుడు నా ఎమోషన్ తృప్తి చెందలేదు. అందుకే 'మగధీర'లో ఇసుక ఊబిలో కూరుపోయిన చరణ్ బయటకు వచ్చిన తర్వాత తన గుర్రాన్ని కౌగలించుకుంటాడు. ఒక స్నేహితుడిలా చూస్తూ దానితో కృతజ్ఞత భావంతో మాట్లాడతాడు. అలా నా సినిమాల్లో బలమైన సన్నివేశాలు ప్రేక్షకుల ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది రాసినవే ఉంటాయని రాజమౌళి చెప్పుకొచ్చారు.





## విడుదలకు సిద్ధంగా అనుష్క ఘాటి

టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. దస్సోరా సాంగ్‌ను ఆగస్టు 20న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు- కొత్త లుక్ విడుదల చేశారు. విక్రమ్ ప్రభు, అనుష్క తమ భుజాలపై భారీ మూటలు మోస్తూ కొండలపై నుంచి వస్తున్న లుక్ పాటపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటను నాగవెల్లి విద్యాసాగర్ కంపోజ్ చేశాడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోన్న నేపథ్యంలో నిరాశ చెందుతున్న అభిమానులు, ఫాలోవర్లు ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని అనుష్క టీంకు రిక్వెస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు- గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.